

# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి.. చెప్పండి...

విజయవాడ | తేదీ : 1-7 జనవరి 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 31 | పేజీలు : 4 | రూ. 5.00








## 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ గా తెలుగుజాతి నిలవాలన్నదే నా ఆకాంక్ష

**-హైదరాబాద్ లో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు ముఖ్య అతిథిగా ఏపీ సీఎం చంద్రబాబు**



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఉద్యమంలో ప్రపంచంలోని తెలుగువారంతా భాగస్వాములు కావాలని, 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ గా తెలుగుజాతి నిలవాలన్నదే తన ఆకాంక్ష అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగువారికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరికం లేని సమాజం సాధిస్తామని అన్నారు. హైదరాబాద్ హెచ్ ఐసీసీలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...ప్రపంచంలో ఉండే తెలుగువారందరినీ ఒకే వేదికపై చూడటం చాలా సంతోషంగా ఉంది. తెలుగువారి గౌరవాన్ని చాటిచెప్పిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహిస్తున్న ఈ తెలుగు మహాసభలను ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రారంభించడం మనకు గర్వకారణం. డీవీఎస్ రాజు, ఇందిరాదత్ సహా ప్రముఖులు ఈ సభలకు ఎనలేని సేవలు అందించారు. అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకూ శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకూ ఎక్కడ ఉన్నా తెలుగువారంతా ఒకటే . ఏపీ, తెలంగాణలోనే కాదు...అమెరికా సహా ఏ దేశంలో చూసినా మన తెలుగువారే. బ్రెయిన్ డ్రెయిన్...బ్రెయిన గెయిన్ అవుతుందని నేను 1996లో ముఖ్యమంత్రి అయ్యినప్పుడే చెప్పాను. మన తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారికంటే విదేశాల్లో ఉన్న తెలుగువారే భాషా, సంప్రదాయాలను కాపాడుతున్నారు.

**హైదరాబాద్ అభివృద్ధిని నేను ఆనాడే ఊహించా:** 1996లో నేను సీఎం అయినప్పుడు ఈ ప్రాంతమంతా రాళ్లు, రప్పలు. ఇది ప్రపంచంలోనే ఐటీ సిటీగా తయారవుతుందని నేను ఆనాడే ఊహించాను. హైదరాబాద్ అభివృద్ధిలో టీడీపీ పాత్ర ఉంది. దేన్నయినా ముందే ఊహించగలగాలి. 96లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు నెలనెలా జీతాలు ఇవ్వలేక మూడునెలలకు ఒకసారి ఇచ్చేవాళ్లం. నేను విజన్ 2020 అన్నప్పుడు అందరూ ఎగతాళి చేశారు. తెలుగు ఏంజిల్స్ అనే స్టార్టప్ పేరుతో అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. మనమంతా సమిష్టిగా పనిచేస్తే ఏదైనా సాధించగలము. నాడు టీడీపీ హయాంలో వేసిన పునాది కారణంగా తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.






**ప్రపంచమంతా తెలుగువారు రాణిస్తున్నారు:** సత్య నాదెళ్ల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో చదివిన వ్యక్తి. నేడు మైక్రోసాఫ్ట్ అధినేతగా తయారయ్యాడంటే అదీ మన తెలుగువారి శక్తి. దేశానికి దశ, దిశ చూపిన పీవీ మన తెలుగు బిడ్డ. 1996లో నేను ముఖ్యమంత్రి అయ్యేప్పటికే పీవీ. నరసింహారావు గారు ప్రధానిగా ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన సంస్కరణలను అందిపుచ్చుకుని ముందుకెళ్లాను. ఐటీకి ప్రాధాన్యత ఇచ్చాను. ఐటీ తిండిపెడుతుందా, సెల్ ఫోన్ లు ఉపయోగమా అని ఎగతాళి చేశారు. యువత టెక్నాలజీని అందిపుచ్చుకుని పారిశ్రామిక వేత్తలుగా రాణించారు. ప్రపంచంలో అమెరికాలో ఎక్కువ తలసరి ఆదాయం పొందుతున్నది మన తెలుగువారే. ఏదేశంలోనైనా ఖరీదైన ప్రాంతానికి పోతే అక్కడ మన తెలుగు మాట్లాడే వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. 2023-24లో 3 లక్షల 30 వేల మంది భారతీయులు అమెరికాలో చదువుకునేందుకు వెళ్లగా అందులో లక్షా 80 వేలమంది తెలుగువారే. అమెరికాలో 12వ భాష తెలుగు. మున్ముందు అన్ని దేశాల్లో తెలుగు ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. యువత అవకాశాలు కోసం విదేశాలు వెళ్లారు. అయితే ఏ దేశంలోనైనా మనకు ఆమోదం రావాలంటే అక్కడి ప్రజలకు మనం సేవలు అందించాలి. అదే సమయంలో జన్మభూమిని మర్చిపోకూడదు. కర్మభూమికి కూడా సేవలు చేయాలని నేను కోరుతున్నాను. నేడు ఏఐ, డీప్ టెక్నాలజీ యుగం నడుస్తోంది. ప్రతి ఇంటికీ ఒక ఐటీ ఉద్యోగి ఉండాలి. ప్రతి ఇంట్లో ఆంత్రప్రెన్యూర్ రావాలి. నేను సింగపూర్ పర్యటనలో ఒక మాట చెప్పాను. మనం పారిశ్రామిక వేత్తగా తయారై డబ్బు సంపాదిస్తే వాటిని మళ్లీ ఉపాధి కల్పనకు ఉపయోగించాలని పిలుపునిచ్చాను. ఆనాడు హైదరాబాద్ లో ఒక మంచి కన్వెన్షన్ సెంటర్ కట్టాలనుకుని దుబాయ్ ప్రభుత్వాన్ని సంప్రదించాను. ఇక్కడ కన్వెన్షన్ సెంటర్ కడితే ఎమ్మార్ ప్రాపర్టీస్ లో విల్లాస్ కట్టేందుకు అనుమతి ఇస్తానని హామీ ఇచ్చాను. ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా నేను ఇలాంటివి తెచ్చాను. ఐటీ అభివృద్ధి కోసం హైటెక్ సిటీ కట్టాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకొచ్చాను. ఏపీ, తెలంగాణలోనే కాదు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగువారందరూ పరస్పరం సహకరించుకోవాలి. పేదరికం లేని సమాజం మన లక్ష్యం కావాలి. భారత్ బయోటెక్ ఎల్లా కృష్ణ ప్రపంచానికే కరోనా వ్యాక్సిన్ తయారుచేశారు. మన ప్రధాని 90 దేశాలకు కొవిడ్ వ్యాక్సిన్ ఇచ్చారంటే అది హైదరాబాద్ నుంచి తయారుకావడం గర్వకారణం. పీపీపీ విధానంలో సంపద సృష్టించవచ్చు. దక్షిణ భారతదేశంలో సంవత్సరాల తరబడి జనాభా పెరుగుదల రేటు క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. . ఏపీ జనాభా గ్రోత్ రేట్ 1.5 % .దక్షణ కొరియా .5% గా ఉంది. జపాన్, చైనా, యూరప్ వంటి దేశాల్లో జనాభా తగ్గింది. ఇండియా నుంచి మనుషులను పంపమని జర్మనీ లాంటి దేశాలు కోరుతున్నారు. నీటి భద్రత , కరువు నివారణ కోసం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు చేపట్టాము. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాను. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి పెట్టాను. స్వర్ణాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్తున్నాము. భవిష్యత్ లో డీప్ టెక్నాలజీ దే హవా. వాట్సప్ గవర్నెన్స్ తీసుకొస్తున్నాం. ఆఫీస్ కు రాకుండా 150 సర్వీసులు ఇంటి నుంచే అందించే సౌలభ్యం తీసుకొస్తున్నాం.

**తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలు చేసిన మహానుభావులు:** ప్రపంచంలోనే తెలుగువారికి గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ . తెలుగుకు విశేషరూపం ఎన్టీఆర్. పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించాడు. తెలుగుభాషకు వన్నె తెచ్చిన గిడుగు రామ్మూర్తి, తెలుగు భాషా వికాసానికి రామోజీరావు వంటి వారిని ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి. పీవీ నరసింహారావు, వెంకయ్య నాయుడు , కోకా సుబ్బారావు, జస్టిస్ రమణ, నీలం సంజీవరెడ్డి, బాలయోగి వంటి తెలుగువారు ఉన్నత పదవుల్లో రాణించారు. కరణం మల్లీశ్వరి , పుల్లెల గోపీచంద్, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వీవీఎస్ లక్ష్మణ్, పీవి సింధు, పెండ్యాల హరికృష్ణ, వెంకటపతి రాజు, నితీష్ కుమార్ రెడ్డి వంటి తెలుగువారు ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభ చాటారు. చెన్నై నుంచి హైదరాబాద్ కు సినీ పరిశ్రమను తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశాము. నేడు తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి చేరింది. కూచిపూడి భరతనాట్యం ,బతుకమ్మ మన సంస్కృతికి అద్దం పడుతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు.

## బుడమేరు వరదలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు

**- రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, నిమ్మల రామానాయుడు**



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :బుడమేరు వరద నియంత్రణ పై విజయవాడ ఇరిగేషన్ క్యాంప్ ఆఫీస్ లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి పి. నారాయణ, లు ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష చేశారు. ఈ సమీక్షా సమావేశానికి ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, మున్సిపల్ వ్యవహారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు, సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఇరిగేషన్ ఈఎన్సీ వెంకటేశ్వరావు లతో పాటు ఇరిగేషన్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్, రెవిన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమగ్ర నివేదిక అందించేందుకు ఆయా శాఖల అధికారులతో బుడమేరుపై సమగ్ర సమీక్ష చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృత్తం కాకుండా, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు ఇప్పటికే నాలుగుసార్లు బుడమేరు వరదలపై ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా సమీక్షలు చేయడం జరిగింది. అదేవిధంగా వరదల సమయంలో బుడమేరు నుంచి వెళ్లే ప్రవాహ వేగాన్ని పెంచడంతోపాటు 40,000 క్యూసెక్కుల నీరు వచ్చినా తట్టుకునే విధంగా భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. సమీక్ష అనంతరం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ బుడమేరు నష్టాన్ని అందరం చూశామని, ఒక్కరోజే 50,000 క్యూసెక్కుల వరద నీరు రావడం, మూడు చోట్ల గండ్లు పడటం జరిగాయన్నారు. ముఖ్యమంత్రి అపార అనుభవంతో వరదల నుంచి ప్రజలను గట్టెక్కించగలిగామన్నారు. భవిష్యత్ లో బుడమేరు వరదల నుంచి ప్రజలను కాపాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాల మేరకు దీనిపై సమగ్ర నివేదిక అందించేలా ఇరిగేషన్, మున్సిపల్, రెవిన్యూ శాఖల అధికారులతో సమీక్ష చేశామన్నారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ కెపాసిటీ ప్రస్తుతం 17,500 క్యూసెక్కుల నుంచి 37,500 క్యూసెక్కులకు పెంచేలా పెండింగ్ పనులు పూర్తి చేసేలా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు అందిస్తామన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ నుండి కొల్లేరు వరకు ఓల్డ్ ఛానెల్ సామర్ధ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచనలు చేశామన్నారు. 2014-19 కాలంలోనే బుడమేరు డైవర్షన్ ఛానెల్ సామర్ధ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచేలా రూ. 464 కోట్లతో టెండర్లు అప్పగించి 80 శాతం పనులు కూడా పూర్తి చేశామన్నారు. అయితే గత ప్రభుత్వం బుడమేరు విస్తరణకు నిధులు ఉన్నా మిగిలిన 20 శాతం పనులకు సంబంధించి తట్ట మట్టిగాని, బస్తా సిమెంట్ పని గాని వేయలేదన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పాపం ఫలితమే బుడమేరు ముంపుకు కారణమన్నారు. అంతేకాకుండా దానికి విజయవాడ నగర ప్రజలు మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. 2014-19 కాలంలోనే ఎనికేపాడు యూటీ నుండి కొల్లేరు వరకు వెళ్ళే ఛానల్ విస్తరణ పనులను గత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. బుడమేరు ఛానెల్ కు సమాంతరంగా ఓల్డ్ ఛానెల్ ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్ధ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొల్లేరు నుంచి ఎటువంటి అడ్డంకులు లేకుండా సముద్రానికి వెళ్లేలా ఉప్పుటేరు ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇదే అంశం మీద ఈ నెల 18న మరోసారి సమీక్ష చేస్తామన్నారు. మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ బుడమేరు వరదల వల్ల విజయవాడ నగరంలోని 34 వార్డుల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంగా 5 లక్షల మంది 4 రోజులు నీళ్ళలోనే ఉండటం బాధాకరమన్నారు. ఆ సమయంలో వారికి కనీసం రోజు వారీ అవసరాలకు కూడా నీరు అందని పరిస్దితి ఉందన్నారు. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన స్ఫూర్తితో ప్రజలకు రోజుకు 20 నుంచి 30 లక్షల డ్రింకింగ్ వాటర్ బాటిళ్ళు పంపిణీ చేశామన్నారు. వాటర్ బాటిళ్ల పంపిణీని కూడా కొద్దిమంది రాజకీయం చేసారన్నారు. అయితే మేము ప్రజలకు ఏది అవసరమో అదే అందించామన్నారు. గత ప్రభుత్వం బుడమేరు టెండర్లు రద్దు చేయకుండా ఉంటే విజయవాడకు ఈ పరిస్దితి వచ్చేది కాదన్నారు. బుడమేరు వరదలకు గత ప్రభుత్వమే కారణమన్నారు. మరోసారి జనవరి 18 న మూడు శాఖల అధికారులతో ఇరిగేషన్, మున్సిపల్, రెవిన్యూ శాఖలతో సమావేశం అవుతామన్నారు. భవిష్యత్తులో విజయవాడ నగరానికి వరద సమస్య లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వరద నియంత్రణ చర్యలు చేపట్టడం పై చర్చించామన్నారు. బుడమేరు, కృష్ణానదికి ఒకేసారి వరద వస్తే ఏం చేయాలన్నదానిపై కూడా ప్రధానంగా చర్చించామన్నారు. దీనిపై డిజాస్టర్ మేనేజ్మెంట్ తో కూడా చర్చించాల్సి ఉందన్నారు. ఒక పక్క రాష్ట్ర ఖజానా కూడా ఖాళీ అయిన పరిస్థితి ఉందని అయితే గత ప్రభుత్వం సరైన ఫైనాన్స్ ప్లానింగ్ చేయకపోవడం వల్ల ఇబ్బందులున్నాయన్నారు. ముఖ్యమంత్రి అపార అనుభవం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందన్నారు. బుడమేరు వరద నియంత్రణ కు సంబంధించి కేంద్రానికి నివేదించి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరతామన్నారు.

## రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం - ప్రధని మోదీ



ఢిల్లీ,నేటి పత్రిక ప్రజావార్త : కొత్త ఏడాది ప్రారంభం రోజునే రైతన్నలకు కేంద్రం శుభవార్త చెప్పింది. అన్నదాతల క్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్లున్నట్లుగా స్పష్టం చేసింది. వ్యవసాయానికి ఉపయోగకరమైన కీలక నిర్ణయాలను తీసుకుంది. పంటల దిగుబడిని పెంచేందుకు వాడే డీఏపీ, నష్టాల నుంచి రైతులను అదుకునేలా రెండు పంట బీమా పథకాలపై ఊరట కలిగించేలా కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్వర్యంలో కేంద్ర కేబినెట్ 2025 సంవత్సరంలో తొలిసారి సమావేశమై రైతు సంక్షేమమే మా ధ్యేయం అని స్పష్టం చేసింది. డీఏపీపై అదనపు సబ్సిడీని డిసెంబర్ 31 2024 తరువాత కూడా కొనసాగించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. మార్కెట్లో ఈ కీలక ఎరువు ధరను నియంత్రించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సబ్సిడీతో మార్కెట్ల డీఏపీ 50 కిలోల బస్తా రూ.1350కి లభించనుంది. సబ్సిడీని కొనసాగించడం వల్ల ఖజానపై రూ.3850 కోట్ల వరకు భారం పడుతుందని కేంద్రం వెల్లడించింది. గత సంవత్సరంలో ధరలను అదుపులో ఉంచడానికి రూ.2625 కోట్ల ఆర్థిక భారంతో2024 ఏప్రిల్ 1 నుంచి 2024 డిసెంబర్ 31 వరకు టన్నుకు రూ.3500 సబ్సిడీ చొప్పున డీఏపీపై వన్ టైమ్ స్పెషల్ ప్యాకెజీని కేంద్రం అప్పుడు ప్రకటించింది. 2025 జనవరి 1 నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు డీఏపీపై టన్నుకు రూ.3500 చొప్పున వన్ టైమ్ స్పెషల్ ప్యాకేజీని పొడిగించాలన్న ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ క్యాబినెట్ మరోసారి ఆమోదం తెలిపింది.

## పేదలకు మేలు చేసేలా 22ఏ భూములపై నిషేధం ఎత్తివేత

**ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని సత్యప్రసాద్**




మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : పేదలకు మేలు చేసేలా 22 ఏ భూములపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఏ జిల్లాలో ఎన్నెన్ని భూములు 22 ఏ కింద ఉన్నాయని, అవి ఏ కేటగిరీల కింద ఉన్నాయో మూడు రోజుల్లో నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గత ప్రభుత్వంలో భూ యజమానులను ఇబ్బంది పెట్టి వారి భూములు లాక్కునేందుకు అక్రమంగా ఆ భూములను 22 ఏ కింద పెట్టారని, వాటన్నింటినీ నిషేధ జాబితా నుండి తొలగించాలని ప్రజా ప్రతినిధుల నుండి పెద్ద ఎత్తున వినతులు వస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం నాడు జోన్ 2, జోన్ 3కి సంబంధించిన 11 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు మరియు ఆ జిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి రెవెన్యూ అంశాలపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోదియా, సిసిఎల్ఏ జయలక్ష్మీ, అడిషనల్ సిసిఎల్ఏ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు. ఈ సమీక్ష అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 22ఏ అనేది ప్రధాన సమస్యగా మారిందని, గత ప్రభుత్వం 22ఏ ను దుర్వినియోగం చేసిందని అన్నారు. అక్రమంగా కొందరి భూములను 22ఏలో చేర్చారని అన్నారు. వీటన్నింటకీ పరిష్కారంగా 22 ఏ లో ఉన్న భూములపై నిషేధాన్ని త్వరలోనే తొలగిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో 22 ఏ భూములను నిబంధనలకు విరుద్ధంగా నాలుగున్నర లక్షల ఎకరాలను నిషేధం నుండి తప్పించారని, వాటిల్లో ఏడు వేల ఎకరాలను అక్రమంగా రిజిస్టర్ చేశారని చెప్పారు. ఈ రిజిస్ట్రేషన్నింటీనీ రద్దు చేస్తామని చెప్పారు. వీటిల్లో అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు కూడా తీసుకుంటామన్నారు. కొందరు ఎమ్మార్వోలు అవినీతికి పాల్పడి దొంగ పాస్ పుస్తకాలు పుట్టించి బ్యాంక్ లోన్ కుంభకోణానికి కారణమయ్యారని, వారిపైన కఠిన మైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈనెల 20 తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని చెప్పారు. అప్పటి నుండి 45 రోజుల లోపు ఈ సదస్సుల్లో వచ్చిన గ్రీవెన్స్ ను పరిష్కరిస్తామని చెప్పారు. ఈనెల 20 తేదీ నుండి రీ సర్వేను తిరిగి ప్రారంభిస్తామన చెప్పారు. గత ప్రభుత్వంలో మాదిరి కాకుండా ఈసారి చాలా పకడ్బందీగా రీ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి మండలంలో గ్రామాన్ని ఒక యూనిట్ గా తీసుకొని రీసర్వే చేస్తామని, ఇందులో అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొంటారని చెప్పారు. ఎలాంటి హడావిడి లేకుండా ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా రోజుకు 20 ఎకరాలు మాత్రమే ఒక టీమ్ రీ సర్వే చేస్తుందని చెప్పారు. రీ సర్వే జరిపిన గ్రామాల్లో సభలు నిర్వహిస్తే లక్షా 80 వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నంటినీ కూడా పరిష్కరించి వారికి కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామని చెప్పారు. మిగిలిన వారికి సంక్రాంతి పండుగ తర్వాత కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ పాస్ పుస్తకంపై రాజముద్రతోపాటు క్యూర్ కోడ్ ఉంటుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. కాగా ప్రాంతీయ సదస్సుకు మంత్రులు కొలుసు పార్థసారధి, గొట్టిపాటి రవి కుమార్ కూడా హాజరయ్యారు. వీరితో తోపాటు హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ 22 ఏ జాబితాలో అక్రమంగా ప్రజల భూములను చేర్చారని, వాటిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే ఈనామ్, ఎస్టేట్ బూములను సెటిల్ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఫారెస్ట్, రెవెన్యూ భూముల మధ్య స్పష్టమైన సరిహద్దులను నిర్ణయించాలని కోరారు. పట్టణాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకున్న సామన్యులకు వెనువెంటనే రెగ్యలరైజ్ చేయాలని కోరారు. జగన్న కాలనీల్లో అవినీతిని వెలికి తీసి నిజమైన లబ్ధిదారులకు త్వరగా ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని కోరారు.




# సైబర్ నేరాలకు అడ్డా 'వాట్సప్'..

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, ఎక్స్ (ట్విటర్), టెలిగ్రామ్.. సోషల్ మీడియా/మెసేజింగ్ యాప్ లలో మోసాలు సహజం అయిపోయిన రోజులివి. డబ్బులు వస్తాయంటూ చిన్న మెసేజ్ పంపడం.. ఆ ఆశ మాటున ఖాతాలోని డబ్బంతా గుంజేయడం.. గ్రామాల నుంచి నగరాల వరకు రోజూ ఇవే తరహా నేరాలు. పదుల సంఖ్యలో దారుణాలు.. అయితే, ఇప్పటివరకు మనకు తెలిసిన ఇలాంటివాటి జాబితాలోకి మరొక దానినీ జత చేసింది కేంద్ర ప్రభుత్వం. వాటిలో కాదు.. వాట్సప్ లోనే.. ఫేస్ బుక్, ఇన్ స్టా, ఎక్స్.. ఇవన్నీ సోషల్ మీడియాలు. సోషల్ మీడియాకు దగ్గరగా ఉన్నప్పటికీ వాట్సప్ ను మెసేజింగ్ యాప్ గానే చెప్పాలి. కాగా, వాట్సప్ లోనే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నట్లు సంచలన నివేదిక వెలువరించింది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ. రోజుకో కొత్త పంథాలో నేరగాళ్లు రెచ్చిపోతున్న ఈ కాలంలో తాజాగా చేరినవి డిజిటల్ అరెస్టులు. ఇలాంటివి అసలు లేనే లేవని సాక్షాత్తు ప్రధాన మంత్రి మోదీనే చెప్పారు. అయితే, తమ చర్యలకు సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వాట్సప్ నే వాడుతున్నారాని కేంద్రం పేర్కొంది. స్కామర్ల గడ్డ.. వాట్సప్ లో స్కామర్లు ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని హోం శాఖ తెలిపింది. దీని తర్వాతి స్థానం టెలిగ్రామ్, ఇన్‌స్టా గ్రామ్ లదని వివరించింది. 2023-24 సైబర్ మోసాల జాబితా నివేదిక ప్రకారం.. 2024 జనవరి-మార్చి మధ్య సైబర్ నేరాలపై 43,797 ఫిర్యాదులు వచ్చాయి. టెలిగ్రామ్ పై 22,680, ఇన్ స్టా పై 19,800 ఫిర్యాదులు నమోదయ్యాయి. గూగుల్ సర్వీస్ ప్లాట్ ఫామ్ లతో.. సైబర్ మోసగాళ్లు కొంతమందిని లక్ష్యంగా చేసుకుని ప్రకటనలు ఇచ్చేందుకు గూగుల్ అడ్వర్టైజ్ మెంట్ ప్లాట్ ఫామ్ ను వాడుతున్నట్లు కేంద్రం తెలపడం గమనార్హం. ఇలాంటివి కట్టడి చేస్తామని పేర్కొంది. ఆన్ లైన్ రుణ యాప్ ల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సామాజిక మాధ్యమాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.

# జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్ ఇవే

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : విధానాల మెరుగుదల, సేవల విస్తరణ, సులభతరం చేయడంలో భాగంగా పలు ప్రభుత్వ విభాగాలు చేపట్టిన ఆర్థిక సంబంధమైన కొన్ని మార్పులు ఇవాళ్టి (జనవరి 1, 2025) నుంచి అమల్లోకి వచ్చాయి. సామాన్యుల నుంచి పన్ను చెల్లింపుదార్ల వరకు ప్రభావితం కానున్న ఆ రూల్స్‌పై అవగాహన పొందడం ప్రయోజనకరం. మరి, ఆ వివరాలు మీరూ తెలుసుకోండి.

**ఈపీఎఫ్‌వో కొత్త రూల్..** కేంద్రీకృత పెన్షన్ చెల్లింపు వ్యవస్థలో (సీపీపీఎస్) భాగంగా పెన్షన్ ఉపసంహరణను ఈపీఎఫ్‌వో క్రమబద్ధీకరించిది. దీంతో, పెన్షన్ ఉపసంహరణ మరింత సులభంగా మారింది. పెన్షనర్లు ఇకపై దేశంలోని ఏ బ్యాంకు నుంచైనా పెన్షన్‌ను ఉపసంహరించుకోవచ్చు. అదనపు ధ్రువీకరణ ఇబ్బందులు కూడా తొలగిపోనున్నాయి. మరోవైపు, ఈపీఎఫ్‌వో త్వరలోనే ఏటీఎం కార్డులను జారీ చేయనుంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే ఈపీఎఫ్‌వో చందాదారులు 24 గంటలపాటు డబ్బును విత్‌డ్రా చేసుకునే అవకాశం దక్కుతుంది. అంతేకాదు, ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ పరిమితిని కూడా ప్రభుత్వం ఈ ఏడాది తొలగించే అవకాశాలు ఉన్నాయి.

**జీఎస్టీ విధానంలో కీలక మార్పులు..** జీఎస్టీ పోర్టల్‌లో మెరుగైన భద్రత కోసం పన్ను చెల్లింపుదారులు జనవరి 1 నుంచి మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను పాటించడం తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. మరోవైపు, 180 రోజుల కంటే పాత బేస్ డాక్యుమెంట్లకు ఈ-వే బిల్లులు (ఈడబ్ల్యూబీలు) జనరేట్ కావు.

**ఫీచర్ ఫోన్లలో యూపీఐ పేమెంట్స్ పరిమితి పెంపు..** 'యూపీఐ 123పే' ద్వారా ఫీచర్ ఫోన్లలో పేమెంట్లు చేస్తున్నవారు ఇవాళ్టి నుంచి రోజుకు గరిష్ఠంగా రూ.10,000 వరకు చెల్లింపులు చేసుకోవచ్చు. ఇందుకు అనుగుణంగా మునుపటి రూ.5,000 పరిమితిని ఆర్బీఐ పెంచింది. ఇటీవలే సర్క్యులర్‌ను కూడా జారీ చేసింది.

**రూ.2 లక్షల వరకు హామీ లేని రైతు రుణం..** దేశంలోని రైతులు ఇకపై రూ.2 లక్షల వరకు హామీలేని బ్యాంక్ రుణాన్ని పొందవచ్చు. ఈ మేరకు మునుపటి రూ.1.60 లక్షల పరిమితిని ఆర్బీఐ పెంచింది. ఈ కొత్త నిబంధన రైతులకు మరింత ఉపశమనం కల్పించనుంది. రైతు పెట్టుబడికి ఈ విధానం మరింత దోహదపడనుంది.

**హెచ్-1బీ వీసా ప్రక్రియలో మార్పులు..** ఇవాళ్టి నుంచి భారతదేశంలోని నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులు తమ వీసా అపాయింట్‌మెంట్‌ను ఉచిత రీషెడ్యూల్ చేసుకోవచ్చు. అయితే, రెండవసారి రీషెడ్యూల్ చేయాలనుకుంటే కొత్త దరఖాస్తుతో పాటు వీసా ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉంటుంది. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్ ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. మరోవైపు, జనవరి 17 నుంచి హెచ్-1 వీసా ప్రక్రియ అప్‌డేట్ కానుంది. కొత్త విధానం కంపెనీల అనుకూలంగా ఉంటుంది. భారతీయ హెచ్-1బీ వీసాదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

# అమరావతి అక్యుపంక్చర్ హబ్ ఏర్పాటుకు కృషి...

**డా. మాకాల సత్యనారాయణ**




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఆక్యుపంక్చర్ హబ్‌గా అభివృద్ధి చేసి భారతదేశంలోనే మొట్టమొదటి కేంద్రంగా వుండేలాగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విన్నపాన్ని అందించనున్నట్లు ఎస్పా భారత్ (ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్) వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి డా.మాకాల సత్యనారాయణ కోరుతున్నామని తెలిపారు. ఇలా చేస్తే భారత సాంప్రదాయ వైద్యం మరింత ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మందులు అవసరం లేని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేని ఈ వైద్యం మూలాలు భారతీయ యోగాలో ఉన్నాయని. యోగ విధానానికి ఆధునిక సైన్స్ జతచేసి త్వరితగతిని ఉపశమనము, నయంకావడం మరియు నివారణ సాధ్యమని అనేక సర్జరీలను సైతం లేకుండానే తగ్గించ వచ్చునని డా. మాకాల తెలిపారు. రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ని కలిసి ఆక్యుపంక్చర్ పైనా త్వరగా అభివృద్ధికి చర్యలు చేపట్టవలసినదిగా కోరడమైనది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఆఫ్ హెల్త్ ఎమ్.టి.కృష్ణబాబు, పెనమలూరు ఎమ్.ఎల్.ఏ బోడె ప్రసాద్ మద్దతు కూడ గట్టడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బుద్ధులు ఆక్యుపంక్చర్‌ను అభివృద్ధిపరిచారని వాళ్ళ జ్ఞాపకార్థం అమరావతిని ఆక్యుపంక్చర్ కేంద్రంగా చేయడం సమంచితంగా వుంటుందని డా.మాకాల సత్యనారాయణ తెలిపారు. భారత ప్రభుత్వం ఆక్యుపంక్చర్‌ను ప్రత్యేగ విభాగ చికిత్సగా గుర్తింపు ఇచ్చిన కారణం అందరికి తెలిసిందే.. విజన్ 2047 నాటికి ఆరోగ్య బడ్జెట్, గణనీయంగా తగ్గుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగు పడి ఆనందంగా వుండటానికి మరియు ఆయుష్షు పెరగడానికి అమరావతి ఆక్యుపంక్చర్ హబ్ దోహదం చేయగలదని డా.మాకాల సత్యనారాయణ తెలిపారు.

# నేటి నుంచి 35వ పుస్తక మహోత్సవ మహా యజ్ఞం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : పుస్తక ప్రియులు, విజ్ఞాన సముపార్జకులు అత్యంత ఆసక్తితో ఎదురుచూస్తున్న పుస్తకాల పండుగ ప్రారంభమైంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గత మూడున్నర దశాబ్దాలుగా ప్రతి ఏటా నూతన వత్సరం అక్షర శ్రీకారంతో ప్రారంభించే పుస్తక మహోత్సవ మహా యజ్ఞం ఈనెల 2వ తేదీ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభమవుతుందని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి టి.మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం ఉదయం మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2వ నుంచి 12వ తేదీ వరకు 12 రోజులపాటు మహోత్సవం కొనసాగుతుందని తెలిపారు. గతంలో రానటువంటి ఆంధ్ర ప్రచురణ కర్తలు విచ్చేస్తున్నారని, ఈ ఏడాది 234 స్టాల్స్‌తో అనేకమంది పబ్లిషర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి పిడికిటి రామకోటేశ్వరరావు (సాహితీ నవజీవన్ బుక్ లింక్స్) పేరు పెట్టడం జరిగిందని, అలాగే ప్రధాన సాహితీ వేదికకు ప్రముఖ పత్రికా సంపాదకుడు రామోజీరావు పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల కార్యక్రమాలు జరుగు ప్రతిభా వేదికకు ప్రఖ్యాత పారిశ్రామికవేత్త రతన్ టాటా పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. రెండవ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అదేవిధంగా జనవరి 6వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుండి పుస్తక మహోత్సవం వరకు జరుగుతుందని, పుస్తక ప్రియుల పాదయాత్రను ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరి కె.విజయానంద్ ప్రారంభిస్తారని తెలిపారు. రతన్ టాటా ప్రతిభా వేదికపై విద్యార్థులకు సంబంధించిన కార్యక్రమాలు 2 నుంచి 12వ తేదీ వరకు జరుగుతాయని బుద్ధి వికాసానికి మానసిక వికాసానికి ఉపయోగపడే, అంతర్లీనంగా వారిలో ఉన్న ప్రతిభను ప్రకటితం చేసుకునే ఎన్నో కార్యక్రమాలు ఆ వేదికపై జరుగుతాయని తెలిపారు. రెండవ తేదీ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాజీ ప్రధాని పివి నరసింహారావు జీవిత చరిత్రను ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి సాహితీ వేదికపై సంస్మరణ సభలు, పుస్తకాల ఆవిష్కరణలు, ప్రముఖుల జయంతి ఉత్సవములు, శతజయంతి సభలు, సాహితీ ప్రసంగాలు జరుగుతాయని 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముగింపు సభ, బహుమతి ప్రదానోత్సవ సభ జరుగుతుందని తెలిపారు. పుస్తక మహోత్సవానికి విచ్చేసేవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా మహోత్సవ ప్రాంగణాన్ని తీర్చి దిద్దడం జరిగిందని తెలిపారు. సమావేశంలో బుక్ ఫెస్టివల్ సోసైటీ అధ్యక్షుడు కె లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షుడు బెల్లపు బాబ్జి, కన్వీనర్ ఎమ్మెస్కో విజయ్ కుమార్ సంయుక్త కార్యదర్శి కె.రవి, సభ్యులు విశ్వేశ్వరరావు, గోళ్ళ నారాయణరావు తదితరులు పాల్గొని రెండు వేదికలపై 12 రోజులు జరిగే కార్యక్రమాల వివరాలను సమగ్రంగా తెలియచేశారు.

# మల్లవల్లి రైతుల హౌజ్ అరెస్ట్ పై మల్లాది విష్ణు ఫైర్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి రైతులను హౌజ్ అరెస్ట్ చేయడంపై వైసీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తీవ్రంగా స్పందించారు. వందలాది మంది పోలీసులు గ్రామాన్ని మోహరించడంపై నిప్పులు చెరిగారు. పచ్చని పొలాలను ప్రభుత్వానికి ఇచ్చిన రైతులను ఈ ప్రభుత్వం సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తూ.. హౌజ్ అరెస్ట్ లు చేయడం దుర్మార్గమన్నారు. ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూసేకరణలో నష్టపరిహారం అందని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకానీ పంటలు పండించే రైతుపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకంతో గత తెలుగుదేశం హయాంలోనే ఏపీఐఐసీకి ఇక్కడి రైతులు భూములు అప్పగించారని గుర్తుచేశారు. కానీ పరిహారం అందించకుండా రైతులను కూటమి సర్కారు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా రైతులకు కులాలు, పార్టీలను ఆపాదిస్తూ.. పరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాంత రైతులకు న్యాయం చేస్తానని మల్లవల్లి పర్యటన సమయంలో పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ ఏమైందని ఈ సందర్భంగా ప్రశ్నించారు. న్యాయం చేయడమంటే బలవంతంగా భూములు లాక్కోవడమేనా..? సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే మల్లవల్లి రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని.. లేకుంటే రైతుల తరపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.




# తెలంగాణ వార్తలు




# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాశారు. రాష్ట్రంలో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరపై రూ.400 బోనస్ ఇచ్చి కంది రైతులను ఆదుకోవాలన్నారు. తెలంగాణలో దాదాపు 6 లక్షల ఎకరాల్లో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల కందులు ఉత్పత్తి అయ్యే అవకాశముందన్నారు. కందులకు మద్దతు ధరకు అదనంగా ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పిన కాంగ్రెస్... అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కందులకు మద్దతు ధర రూ.7,550గా ఉందని, బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.6,500 నుంచి రూ.6,800 మాత్రమే ఉందన్నారు. దీంతో రైతులు ప్రతి క్వింటాలుకు రూ.800 వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కంది రైతుల విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. కంది కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# సాధారణ కాంగ్రెస్ కార్యకర్తకు దక్కిన గౌరవం కూడా పీవీకి దక్కలేదు: కిషన్ రెడ్డి



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణవాడైన పీవీ నర్సింహారావు పట్ల సోనియా గాంధీ అమర్యాదగా ప్రవర్తించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సాధారణ నాయకుడికి దక్కిన గౌరవం కూడా మన తెలంగాణ బిడ్డ పీవీకి ఆనాడు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ అంతిమ సంస్కారాలు ఢిల్లీలో జరపడానికి వీల్లేదని సోనియా నాడు హుకుం జారీ చేశారని మండిపడ్డారు. పీవీ నర్సింహారావు భౌతికకాయాన్ని హైదరాబాద్‌కు పంపించారన్నారు. మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అన్నారు. తాను కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన వీల్ చైర్‌లో రాజ్యసభకు వచ్చారని తెలిపారు. ఎన్నోసార్లు మన్మోహన్ సింగ్‌కు నమస్కరించే అవకాశం తనకు దక్కిందన్నారు. ఎన్నో ఒత్తిళ్ల మధ్య ఆయన పదేళ్లు ప్రధానిగా పని చేశారని ప్రశంసించారు. మన్మోహన్ సింగ్ మరణాన్ని కూడా కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాజపేయికి ఏర్పాటు చేసినట్లుగానే మన్మోహన్ సింగ్‌కు కూడా స్మారక కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో ప్రధాని మోదీ ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారన్నారు. కేంద్రాన్ని, మోదీని విమర్శించే నైతిక అర్హత రాహుల్ గాంధీకి లేదన్నారు.

# సీఎంఆర్ కాలేజీ బాత్రూం వీడియోల ఘటన... విచారణకు ఆదేశించిన మహిళా కమిషన్


మేడ్చల్, నేటి పత్రిక ప్రజావార్త : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని కండ్లకోయ సీఎంఆర్ మహిళా కాలేజీ హాస్టల్ ఘటనను రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటాగా స్వీకరించింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. సీఎంఆర్ మహిళా కాలేజీ హాస్టల్లో బాత్రూంలోని దృశ్యాలను చిత్రీకరించిన అంశంపై వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ సీపీని మహిళా కమిషన్ ఆదేశించింది. కాగా, సీఎంఆర్ మహిళా కాలేజీ హాస్టల్‌లో బాత్రూంల పక్కనే వంట గది ఉంది. బాత్రూం దృశ్యాలను వీడియోలు చిత్రీకరిస్తున్నట్లు ఆరోపిస్తూ విద్యార్థినులు నిన్న మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు ధర్నా చేశారు. పోలీసుల జోక్యంతో వారు ఆందోళనను విరమించారు. విద్యార్థినుల ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తులు ఇవ్వాలా?:



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతు భరోసాకు నిబంధనలు పెట్టవద్దని ఆమె డిమాండ్ చేశారు. గురువారం తన నివాసంలో జరిగిన బోధన్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ... రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ అన్నదాతకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతు భరోసా కోసం రైతులకు షరతులు విధించడమేమిటని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ప్రభుత్వాన్ని అడుక్కోవాలా? అని ప్రశ్నించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తుల పేరిట ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించిందని గుర్తు చేశారు. ఇంకా ఎన్ని దరఖాస్తులు తీసుకుంటారని నిలదీసింది. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా? లేక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతారా? అని మండిపడ్డారు. కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని, కానీ ఈ కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారన్నారు. షరతులు, నిబంధనలు పెట్టి పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతు భరోసాను ఎగవేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు.

# హైడ్రా కూల్చివేతలు ఆగవు... కానీ ఆ తర్వాతే: కమిషనర్ రంగనాథ్



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : హైడ్రా కూల్చివేతలు ఆగవని... చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించిన తర్వాత మళ్లీ కూల్చివేతలు మొదలు పెడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ విషయంలో కూడా హైడ్రాకు ఒక ప్లాన్ ఉందని తెలిపారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని చెరువులు, ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడుతుందన్నారు. రెండు వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పని చేస్తుందని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు తమకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. అయినా మూసీ ఆక్రమణలపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ఆక్రమణల విషయంలో భూ యజమానులకు మాత్రమే కాదని... కిరాయిదారులకు కూడా నోటీసులు ఇస్తామన్నారు. ప్రస్తుతం చెరువుల పునరుజ్జీవంపై దృష్టి సారించామన్నారు. త్వరలో 12 చెరువులను పునరుద్ధరిస్తామని తెలిపారు. అన్ని చెరువుల ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌ల వివరాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. జులై 19కి ముందు అనుమతులు పొంది ఉండి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నివాసాలను కూల్చబోమని హామీ ఇచ్చారు. కమర్షియల్ బిల్డింగ్‌లపై మాత్రం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం హైడ్రా కార్యాలయానికి వచ్చి ఎవరైనా ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు. హైడ్రా ఎవరికీ ఎన్‌వోసీ ఇవ్వదని తెలిపారు. మధురా నగర్‌లో తాము ఉంటున్న ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. ఇప్పుడు అక్కడ చెరువు లేదని.. అయినప్పటికీ తాము చెరువు కట్టకు కిలోమీటర్ దూరంలో ఉన్నామని వెల్లడించారు. నెగిటివ్ ప్రచారం సరికాదని అసహనం వ్యక్తం చేశారు.

# అట్టహాసంగా ప్రారంభించిన కామన్ డైట్ ఆరంభ శూరత్వమేనా?: కేటీఆర్



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. "అట్టహాసంగా ప్రారంభించిన కామన్ డైట్ ఆరంభ శూరత్వమేనా? గురుకులాలను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారా? అందుకే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల్లో, విద్యార్థుల తల్లిదండ్రులలో అభద్రతా భావం పెంచుతున్నారా ? ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు మరణించినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? కేసీఆర్ పాలనలో దేశానికి ఆదర్శంగా ఉన్న గురుకులాలపై ఇప్పుడు అంతులేని నిర్లక్ష్యం చూపిస్తున్నారు" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై డీజీపీ, హైదరాబాద్ సీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గల సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సీపీకి జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు ఇచ్చింది. పుష్ప-2 విడుదల సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని పోలీసు బాసులను ఆదేశించింది. సీనియర్ ర్యాంక్ పోలీస్ అధికారితో ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని తెలిపింది. సంధ్య థియేటర్ ఘటనపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె కొడుకు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ కార్యాలయం ఘనంగా జరిగిన నూతన సంవత్సర వేడుకలు

*-వైసీపీ శ్రేణులతో కోలాహలంగా మారిన ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయం*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నూతన సంవత్సరం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మరియు విజవాడ నగరం నుండి పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు, కార్యకర్తలు, దేవినేని అభిమానులు,శ్రేయోభిలాషులు దేవినేని అవినాష్‌కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్శకులతో పార్టీ కార్యాలయం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ అభిమానంతో తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు అని అన్నారు. మీ ప్రేమాభిమానాలు మాపై ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు మనందరికీ మంచి చేసిన ఈ వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి మరలా జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి అండగా నిలవాలని అవినాష్ పిలుపునిచ్చారు.

# ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో కనుల పండువగా ధనుర్మాసోత్సవాలు




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ముత్యాలం పాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. సాయిబాబా మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ శనివారం విశేషంగా 1008 లఘు గంగాళములతో పాయస నివేదన (కూడారై), 13న శ్రీ గోదా రంగనాథ స్వామివార్ల కళ్యాణం కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ధనుర్మాసోత్సవాల్లో పాల్గొని శ్రీ గోదా రంగనాథస్వామి వార్లను దర్శించుకుని వారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. శ్రీ గోదా రంగనాథస్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ఆకాంక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధనుర్మాస మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి వ్యవస్థాపక కన్వీనర్ ఎం.సత్య శ్రీహరి, పారాయణ మండలి సభ్యులు, మద్దు శ్రీనివాసరావు, మద్దు వెంకటేశ్వర్లు, ముచ్చర్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ లపై ఇన్స్పెక్టర్లు సమగ్ర నివేదిక ఇవ్వాలి...



గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : గుంటూరు నగరంలో 10వ తేదీలోపు శానిటరీ డివిజన్ల వారీగా ట్రేడ్ లైసెన్స్ లపై ఇన్స్పెక్టర్లు సమగ్ర నివేదిక ఇవ్వాలని, 17 నుండి డి & ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సామవేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుధ్య పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా డి&ఓ ట్రేడ్ లైసెన్సు ఉండాల్సిన సంఖ్య కన్నా తక్కువగా ఉన్నాయని, నూతనంగా శానిటరీ డివిజన్ల పునర్విభజన చేసినందున ఇన్స్పెక్టర్లు తమ డివిజన్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లు, రెన్యువల్ చేసుకున్నవి, నూతనంగా తీసుకోవాల్సి ఉండి తీసుకోకుండా ఉన్న వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని, నగరంలోని కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే నగరంలో పారిశుధ్య విభాగ పనితీరులో మార్పు రావాలని, 3వ తేదీ నుండి 9వ తేదీ వరకు స్పెషల్ శానిటేషన్ వీక్‌గా రోడ్ల మీద వ్యర్థాలు, డెబ్రిస్ తొలగించాలన్నరు. ఇప్పటికే నూతనంగా డంపర్ బిన్లను, పుష్ కాట్స్ ని అందించామని, డివిజన్ల వారీగా అవసరం మేరకు అదనపు ట్రాక్టర్లను కూడా ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇచ్చామన్నారు. 802 మైక్రో ప్యాకేట్స్ వారీగా మెరుగైన పారిశుధ్యం కోసం కృషి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిని విధుల నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సూపర్వైజర్ల పేరుతో ఏ ఒక్క ప్రజారోగ్య కార్మికుడు ఉండడానికి వీలులేదన్నారు. ప్రజారోగ్య విభాగం నుండి అందించే సేవలు నిర్దేశిత గడువులోగా అందించాలని, శానిటరీ సూపర్వైజర్లు గడువులోగా అందించని సిబ్బంది, ఇన్స్పెక్టర్ల పై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల 10 నాటికి నగరంలో రోడ్ల మీద ఆవులు, ఎద్దులు ఉండడానికి వీలు లేదని, వాటిని పట్టుకొని జిఎంసి గోశాలకు తరలించాలన్నారు. డివిజన్ల వారీగా కార్మికుల హాజరు, లీవుల రిజిస్టర్లు మెయిన్టెన్ చేయాలని, సెలవు చీటీ ఇచ్చిన తర్వాతనే సెలవు మంజూరు చేయాలన్నారు. ఎంహెచ్‌ఓ, సిఎంహెచ్‌ఓ ప్రజారోగ్య విభాగ పనితీరును ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనితీరు మెరుగయ్యేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిఎంఓహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి, డాక్టర్ పిజె అమృతం, ఎంహెచ్‌ఓ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, ఏ ఎంహెచ్‌ఓలు ఆనందకుమార్, రాంబాబు, శానిటరీ సూపర్వైజర్లు ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరిండెంట్ పోలేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 23వ తేదీన కురుబ మహాసభ...



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కురబ మహాసభ జనవరి 23వ తేదీన చిత్తూరు జిల్లా మదనపల్లి ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నామని కురుబ రాష్ట్ర అధ్యక్షులు జబ్బలి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక గాంధీనగర్ ప్రెస్క్లబ్లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుబ కులస్తులు దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది ఉన్నారని రాష్ట్రంలో 20 లక్షలు ఉన్నారని, ఆయన తెలిపారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో మేము నిర్వహించే భారీ మహాసభ 10,000 మందితో నిర్వహిస్తున్నామని దానికి కేంద్రం నుండి, రాష్ట్రంలో అన్నిరాజకీయ పార్టీ అధ్యక్షులను ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. తధానంతరంరాష్ట్ర ఉపాధ్యక్షులు చిరుతలవిటల్ గౌడ్ మాట్లాడుతూ రాయలసీమలో ఏ ఎలక్షన్స్ జరిగిన కురుబ కులస్తులు ముఖ్య కీలకం అవుతారని, ఆయన తెలియజేశారు. కులస్తులకు కూటమి తరుపున 1ఎమ్మెల్సీ 2ఎంపీ బిజెపి తరపున1రాజ్యసభ1 కార్పొరేషన్ డైరెక్టర్‌గా కర్నూల్, అనంతపురం నుండి ఎంపీలుగా ఇచ్చారని చిత్తూరు ఎంపీ ఇవ్వాలని కోరుతున్నామని ఆయన అన్నారు. అంతే కాకుండా కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడి కట్ల పూజారులకు 10,000 జీతం ఇస్తానని, తిరుపతి, శ్రీశైలంలో కురుబ కులస్తులకు డైరెక్టర్లుగా నియమిస్తామని ఆయన తెలిపారు. అంతేకాకుండా తిరుపతిలో రెండు ఎకరాలు భూమిని కనక భవన్ నిర్మాణానికి కేటాయించాలని, కనక భవన్ నిధులు ఇవ్వమని అడిగామని, ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో కురుబ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 2025లో కేంద్ర కేబినెట్ తొలి సమావేశం... రైతుల కోసం కీలక నిర్ణయాలు!

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర కేబినెట్ బుధవారం నాడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2025లో తొలి కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ రైతులకు అంకితం చేశారని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైతుల సంక్షేమం గురించి ప్రధానంగా ఈ కేబినెట్ సమావేశంలో చర్చ జరిగిందన్నారు. పంటల బీమా పథకమైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మరింతగా మెరుగుపరచాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. ఫసల్ బీమా యోజనకు కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అలాగే 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 చొప్పున రైతులకు అందించేందుకు రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి వివరించారు. కేంద్ర కేబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామన్నారు. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే రైతన్నను చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. 2025లో జరిగిన తొలి కేబినెట్ సమావేశాన్ని రైతుల శ్రేయస్సు కోసమే అంకితం చేశామని తెలిపారు. రైతుల విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

# తరం మారింది.. కొత్త ఏడాదిలో కొత్త తరం 'జెన్ బీటా'

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కొత్త ఏడాది వచ్చేసింది.. ప్రపంచమంతా సంబరాలు జరుపుకున్నది. మిగతా సందర్భాలతో పోలిస్తే ఈ ఏడాది మరింత స్పెషల్ గా నిలవనుంది. ఎందుకంటే 2025లో తరం మారింది, కొత్త తరానికి స్వాగతం పలికిందీ సంవత్సరం. ఈ ఏడాది నుంచి 2039 వరకు పుట్టిన వారు 'జెన్ బీటా' తరానికి చెందిన వారు. 21 వ శతాబ్దానికి గుడ్ బై చెప్పి 22 వ శతాబ్దానికి స్వాగతం పలికే తరమిది. 2035 నాటికి ప్రపంచ జనాభాలో 16 శాతం జెన్ బీటా తరం పిల్లలే ఉంటారని అంచనా. కృత్రిమ మేధ ప్రపంచాన్ని ఏలే రోజులకు ఈ తరం సాక్ష్యంగా నిలవబోతోంది. వీరి జీవితాలలో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషించనుందని నిపుణులు చెబుతున్నారు. మిగతా తరాలతో పోలిస్తే జెన్ బీటా తరం పూర్తిగా అడ్వాన్స్ గా ఉంటుందని వివరించారు. ఈ తరంలో మిలీనియల్స్ తరంలో చిన్న వారికి పుట్టే పిల్లలు, జెన్ జెడ్ తరంలో పెద్ద వారికి పుట్టే పిల్లలు ఉంటారు. కాగా, ప్రతీ పదిహేనేళ్లకు ఓ కొత్త తరంగా నిపుణులు లెక్కిస్తున్నారు. ఈ లెక్కన ఎప్పుడు ఏ తరం..

2013 నుంచి 2024 మధ్య కాలంలో పుట్టిన వారు జనరేషన్ ఆల్ఫా (జెన్ ఆల్ఫా), 1997 నుంచి 2012 మధ్య పుట్టిన వారు జనరేషన్ జడ్ (జెన్ జెడ్)

1981 నుంచి 1996 మధ్య జన్మించిన వారు మిలీనియల్స్

1980 నుంచి 1965 మధ్య పుట్టిన వారు జనరేషన్ ఎక్స్ (జెన్ ఎక్స్)

1946 నుంచి 1964 మధ్య జన్మించిన వారు బేబీ బూమర్స్

1928 నుంచి 1945 తరం సైలెంట్ జనరేషన్

1922 నుంచి 1927 తరం గ్రేటెస్ట్ జనరేషన్

# చిరంజీవితో సినిమాపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆసక్తికర వ్యాఖ్యలు



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మెగాస్టార్ చిరంజీవి, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇటీవలే అధికారికంగా ఈ ప్రాజెక్టుపై ప్రకటన కూడా వెలువడింది. నేచురల్ స్టార్ నాని ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అయితే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ మూవీని ఉద్దేశించి శ్రీకాంత్ ఓదెల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. ఇక చిరుకు ఈ యువ డైరెక్టర్ వీరాభిమాని అనే విషయం తెలిసిందే. చిరంజీవితో చిత్రంపై శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ... "చిన్నప్పటి నుంచి ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. ఇవాళ ఆయనతో పనిచేస్తున్నానంటే నమ్మలేకపోతున్నాను. ఈ చిత్రం నాకెంతో ప్రత్యేకం. చిరంజీవి మునుపటి సినిమాలతో పోలిస్తే ఇది భిన్నంగా ఉంటుంది. అంతేగాక ఆయనను ఇందులో కొత్త అవతార్‌లో చూస్తారు. మూవీలో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంటుంది. సుమారు 48 గంటల్లోనే తాము ఈ సినిమా స్క్రిప్ట్‌ను ఫైనల్ చేసేశాం. చిరు ఉత్సుకత నాలో ఎంతో స్ఫూర్తిని నింపింది. ఇక ఆయన కారవాన్ నుంచి బయటకు వచ్చేవరకే నేను ఆయన అభిమానిని. ఒక్కసారి సెట్‌లోకి అడుగుపెట్టారంటే నా మూవీలో ఆయన ఒక పాత్ర మాత్రమే" అని శ్రీకాంత్ ఓదెల అన్నారు. ఇక నానితో తాను తెరకెక్కించిన మొదటి సినిమా 'దసరా' కథకు తన తండ్రే స్ఫూర్తి అని అన్నారు. చిన్నతనంలో తన తండ్రి బొగ్గుగనుల్లో పని చేయడానికే వెళ్లేవారని, ఆ స్ఫూర్తితోనే ఈ మూవీ స్టోరీ రాసినట్లు తెలిపారు. కాగా, 2019లో విడుదలైన 'బ్రోచేవారెవరురా' చిత్రం చూసిన తర్వాత తన మనసు మార్చుకున్నానని, సినిమాల్లోకి అడుగుపెట్టాలని గట్టిగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వెంటనే తన సర్టిఫికేట్స్ అన్నీ తగలపెట్టేశానని ఇంటర్వ్యూలో శ్రీకాంత్ ఓదెల చెప్పుకొచ్చారు. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సుకుమార్ వద్ద మొదట శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత 2023లో వచ్చిన 'దసరా' మూవీతో దర్శకుడిగా మారారు. అలా మొదటి సినిమాతోనే సూపర్ హిట్ కొట్టి ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం తన రెండో సినిమా కూడా నానితోనే చేస్తున్నారు. 'ది ప్యారడైజ్' పేరుతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రం పూర్తయిన తర్వాత చిరుతో ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు.

# అమెజాన్ అడవుల్లో ఇక పాన్ ఇండియా కథ పరుగులు!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :రాజమౌళి... తెలుగు సినిమాకి ఈ పేరు ఒక కీర్తి కిరీటం. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా ఒక సంచలనం. అపజయమెరుగని ఆయన దర్శకుల మార్గదర్శిగా నిలిచారు. అలాంటి రాజమౌళి RRR తరువాత చేయనున్న సినిమా కోసం అభిమానులంతా చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మహేశ్ బాబుతో కలిసి ఒక సినిమా చేయనున్నారు. ఈ సినిమా కోసం మహేశ్ బాబు డిఫరెంట్ లుక్ కోసం కసరత్తు చేస్తున్నాడు. రాజమౌళి కెరియర్ ను పరిశీలిస్తే ఆయన పక్కా ప్లానింగుతో ముందుకు వెళుతుండటం కనిపిస్తుంది. 'సింహాద్రి' 'ఛత్రపతి' వంటి మాస్ యాక్షన్ సినిమాలు, 'యమదొంగ' 'ఈగ' వంటి సినిమాలతో ఫాంటసీ జోనర్ ను టచ్ చేయడం కనిపిస్తుంది. ఇక 'మగధీర' 'బాహుబలి' సినిమాలతో జానపదాలను గుర్తుచేస్తూ, ఈ కాలంలో గుర్రాలను, రథాలను తెరపై పరిగెత్తించారు. తెలుగు సినిమా జెండాను ప్రపంచపటంపై ఎగరేశారు. 'మగధీర' 'బాహుబలి' సినిమాలలో రాజమౌళి అడవులను, జలపాతాలను తెరపై ఆవిష్కరించిన తీరు చూసిన వాళ్లంతా, ఫారెస్టు నేపథ్యంలో ఆయన ఒక యాక్షన్ అడ్వెంచర్ చేస్తే బాగుంటుందని భావించారు. ఇప్పుడు రాజమౌళి ఎంచుకున్న కథా నేపథ్యం అదే. ఆయన తయారు చేసుకున్న కథ ఇప్పుడు అమెజాన్ అడవుల్లో పరుగులు తీయనుంది. నిధి తాలూకు వేట నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. అడవులు, గుహలు, సొరంగ మార్గాలు, జలపాతాలతో కూడిన లొకేషన్స్ ఈ సినిమాకి హైలైట్ గా నిలవనున్నాయి. ఈ నెల చివరి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగు మొదలు కానుంది.

# 2025ని లాభాలతో ప్రారంభించిన స్టాక్ మార్కెట్లు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ ఏడాదిని లాభాలతో ప్రారంభించాయి. ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లను లాభాల దిశగా నడిపించాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 368 పాయింట్లు లాభపడి 78,507కి చేరుకుంది. నిఫ్టీ 98 పాయింట్లు పెరిగి 23,742 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:మారుతి (3.26%), మహీంద్రా అండ్ మహీంద్రా (2.45%), బజాజ్ ఫైనాన్స్ (1.69%), ఎల్ అండ్ టీ (1.64%), టాటా మోటార్స్ (1.15%).టాప్ లూజర్స్: టాటా స్టీల్ (-0.98%), అదానీ పోర్ట్స్ (-0.80%), జొమాటో (-0.54%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (-0.27%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (-0.21%).

# తెలుగు తేజాలు యర్రాజి జ్యోతి, జీవాంజి దీప్తిలకు అర్జున పురస్కారాలు





స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్రం ప్రకటించిన జాతీయ క్రీడా పురస్కారాల్లో తెలుగు తేజాలు ఇద్దరు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగంలో యర్రాజి జ్యోతి, పారా అథ్లెటిక్స్ నుంచి జీవాంజి దీప్తిలకు అర్జున అవార్డులు దక్కాయి. ఇక యర్రాజి జ్యోతి ఏపీలోని విశాఖపట్నం వాసి కాగా, జీవాంజి దీప్తిది తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లా. ఈ ఏడాది ఈ ఇద్దరితో సహా మొత్తం 32 మంది అర్జున పురస్కారాలకు ఎంపికయ్యారు. అటు ఖేల్ రత్నకు మను బాకర్, గుకేశ్, ప్రవీణ్ కుమార్, హర్మన్ ప్రీత్ సింగ్‌లను కేంద్రం ఎంపిక చేసింది. ఇక అర్జున అవార్డు (జీవితకాలం సాఫల్య పురస్కారం) కోసం సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ పేట్కర్ (పారా-స్విమ్మింగ్) ఎంపికయ్యారు. అలాగే ద్రోణాచార్య అవార్డు కోసం కోచ్‌లు సుభాష్ రాణా (పారా-షూటింగ్), దీపాలి దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సాంగ్వాన్ (హాకీ)ను ఎంపిక చేయడం జరిగింది. ఇదిలాఉంటే.. జాతీయ క్రీడా అవార్డులు-2024 విజేతల జాబితాను క్రీడా మంత్రిత్వ శాఖ ఈరోజు (గురువారం) ప్రకటించింది. ఈ నెల 17న ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విజేతలు అవార్డులను అందుకోనున్నారు.

# ఈ సంక్రాంతికి హ్యాట్రిక్ హిట్ ఖాయమంటున్న వెంకీ ఫ్యాన్స్!




సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం'పై మొదటి నుంచి మంచి అంచనాలు ఉన్నాయి. పండగ నేపథ్యం పండగ సందర్భంతో ముడిపడిన కంటెంట్ ఇది. అందువలన సంక్రాంతికి ఒక రేంజ్ సందడి షురూ అయినట్టేనని అంతా రెడీ అయ్యారు. ఈ సినిమా నుంచి వదులుతున్న అప్ డేట్స్ అందరిలో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. కథాకథనాల సంగతి అటుంచితే, తారాగణంతో ఎక్కువగా ఆకట్టుకుంటోంది. వెంకటేశ్‌కి ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. అలాగే అనిల్ రావిపూడి తన కంటెంట్ పై ఏ స్థాయిలో కసరత్తు చేస్తాడనేది కూడా అందరికీ తెలిసిందే. ఈ మధ్య కాలంలో కామెడీని పరిగెత్తిస్తున్న దర్శకుడిగా ఎక్కువ మార్కులు పడింది ఆయనకే. గతంలో వెంకీ-అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'ఎఫ్ 2' 'ఎఫ్ 3' సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. అది కూడా ఈ సినిమాపై అందరూ దృష్టి పెట్టడానికి ఒక కారణమైంది. ఈ సినిమా జోనర్ ఏంటో తెలియగానే 'సంక్రాంతికి వచ్చేయండి' అని అభిమానులే ముందుగా వెల్ కమ్ చెప్పారు. వెంకటేశ్ మరింత హ్యాండ్సమ్ గా కనిపిస్తూ ఉండటం మీనాక్షి చౌదరి గ్లామర్ లుక్, ఐశ్వర్య రాజేశ్ హోమ్లీ లుక్ పండగకి అవసరమైన ఉమ్మడి కుటుంబంలోని సందడి, అల్లరి. ఇవన్నీ ఈ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. క్రితం ఏడాది సంక్రాంతికి 'సైంధవ్'తో ఫ్లాప్ అందుకున్న వెంకీ, ఈ సారి అనిల్ రావిపూడితో హ్యాట్రిక్ హిట్ అందుకోవడం ఖాయమనేది ఫ్యాన్స్ టాక్.

# విలన్‌గా సత్తా చాటేందుకు సిద్ధమైన ఉదయభాను



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : బుల్లితెర యాంకర్లు ఎంతో మంది వెండితెరపై తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ జాబితాలో సుమ, ఝాన్సీ, రష్మీ, శిల్పా చక్రవర్తి, అనసూయ ఇలా ఎంతో మంది ఉన్నారు. వీరిలో ఉదయభాను కూడా ఒకరు. తొలి నుంచీ కూడా ఉదయభాను టాలీవుడ్ పై ఫోకస్ చేస్తూనే ఉంది. సరైన పాత్రలు మాత్రం ఆమెకు రాలేదు. దీంతో, ఆమె ఐటెం సాంగ్స్ కూడా చేసింది. తాజాగా మరో యాంగిల్ ను చూపించేందుకు ఉదయభాను రెడీ అవుతోంది. విలన్‌గా సత్తా చాటేందుకు భాను సిద్ధమయింది. సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'బార్బరిక్' సినిమాలో ఉదయభాను విలనిజం చూపించబోతోందట. ఈ చిత్రానికి శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుందట.

# నేషనల్ గేమ్స్ కి ఏపీ బాక్సర్లు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్లో నిర్వహించనున్న నేషనల్ గేమ్స్ కి రాష్ట్రం తరపునుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆంధ్ర ప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ దేవ్ తెలిపారు. బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన జాబితాలో హెవీ వెయిట్ విభాగంలో(86-92కేజీ ) శివ గణేష్ రెడ్డి( ప్రకాశం జిల్లా), హెవీ వెయిట్ విభాగంలో (92-92o కేజీ) హేమంత్ కుమార్ రత్నం( శ్రీకాకుళం) లు ఎంపికైనట్లు చెప్పారు. సీనియర్ నేషనల్స్ లో క్వాలిఫైయింగ్ రౌండ్ కి అర్హత సాధించడం ద్వారా వీరిని నేషనల్ గేమ్స్ కి బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక చేసినట్లు తెలియజేశారు. రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరు క్రీడాకారులను ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ దేవ్ ప్రత్యేకంగా అభినందించి జాతీయ క్రీడల సైతం రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు.


# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల...

స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అద్భుతంగా రాణిస్తున్న తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. 528 రేటింగ్ పాయింట్లతో 20 స్థానాలు ఎగబాకి 53వ స్థానానికి చేరుకున్నాడు. అరంగేట్ర సిరీస్‌లోనే ఆకట్టుకుంటున్న ఈ యువ ఆల్‌రౌండర్ టాప్-10 భారత బ్యాటర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నాలుగవ టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శనతో శతకాన్ని సాధించిన నితీశ్ అందరి ప్రశంసలు అందుకున్నాడు. టీమిండియా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి సంచలనం సృష్టించాడు.

**దిగజారిన రోహిత్, కోహ్లీ ర్యాంకులు..** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత అగ్రశ్రేణి క్రికెటర్ల ర్యాంకులు భారీగా దిగజారాయి. ఐసీసీ టాప్-10 ర్యాంకుల్లో భారత్ నుంచి యశస్వి జైస్వాల్ మాత్రమే నిలిచాడు. బాక్సింగ్ డే టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 80 ప్లస్ పరుగులు సాధించిన ఈ యువ ఆటగాడు 4వ స్థానంలో నిలిచాడు. జైస్వాల్, నితీశ్ కుమార్ రెడ్డి మినహా మిగతా బ్యాటర్లు అందరి స్థానాలు భారీగా దిగజారాయి.ఆసీస్ పర్యటనలో 5 ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 31 పరుగులు సాధించిన కెప్టెన్ రోహిత్ శర్మ 40వ ర్యాంక్‌కు పడిపోయాడు. విరాట్ కోహ్లీ మూడు స్థానాలు దిగజారి 24వ స్థానానికి పతనమయ్యాడు. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ కూడా ఒక్కో స్థానం దిగజారారు.

**ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారతీయ బ్యాటర్ల స్థానాలు..** యశస్వి జైస్వాల్ - 4, రిషబ్ పంత్ -12, శుభ్‌మాన్ గిల్ - 20, విరాట్ కోహ్లీ - 24, రోహిత్ శర్మ - 40, కేఎల్ రాహుల్ - 41, రవీంద్ర జడేజా - 50, నితీశ్ కుమార్ రెడ్డి - 53, శ్రేయాస్ అయ్యర్ - 68, అక్షర్ పటేల్ - 69

# రాజకీయాల నుంచి రైతన్నను కాపాడే 'గేమ్ ఛేంజర్'!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' రూపొందింది. నిర్మాతగా దిల్ రాజుకి ఇది 50వ సినిమా. అందువలన ఈ సినిమా సంఖ్యా పరంగా ప్రత్యేకతను సంతరించుకుంది. భారీతారాగణంతో రూపొందిన ఈ సినిమాకి తమన్ సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలోని 5 పాటల కోసం 75 కోట్లు ఖర్చు చేశారనేది హాట్ టాపిక్ గా మారిపోయింది. జనవరి 10వ తేదీన విడుదల కానున్న ఈ సినిమా, రాజమౌళి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ - %ూవీదీ% మాల్ లో ట్రైలర్ లాంచ్ ఈవెంటును జరుపుకుంది. రెండు నిమిషాల 40 సెకన్ల నిడివి కలిగిన ట్రైలర్లో .. ఈ సినిమా కంటెంట్ ఏమిటనేది అందరికి అర్థమయ్యేలా చెప్పారనే అనాలి. అవినీతిమయమైన రాజకీయం .. రాక్షసుడిగా మారిన ఒక రాజకీయనాయకుడు. అమాయకులైన అన్నదాతలకు అన్యాయం చేయాలని చూసిన అతణ్ణి, ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కలెక్టర్ ఎలా ఎదుర్కొన్నాడనేది కథ. ఈ సినిమాలో చరణ్ అన్నదాతగా రైతు లుక్ తోను .. ఐఏఎస్ అధికారి లుక్ తోను కనిపిస్తున్నాడు. ఇక సందర్భాన్ని బట్టి మాస్ లుక్ తోను కనిపిస్తున్నాడు. కథానాయకుడు ఒక వైపున తన కుటుంబాన్ని .. మరో వైపున సమాజాన్ని కాపాడుకోవడం కోసం ఎంత రిస్క్ తీసుకున్నాడనేది ట్రైలర్ లో చూపించారు. శంకర్ మార్క్ యాక్షన్ సన్నివేశాలు తెరపై అద్భుతాలు చేయనున్నాయని అర్థమవుతోంది. అలాగే ఫ్యామిలీ ఎమోషన్స్ బలంగా ఉంటాయనే విషయం తెలుస్తోంది. ఇక సాంగ్స్ భారీ సెట్స్ ను కలుపుకుని కలర్ ఫుల్ గా కనువిందు చేయనున్నాయనేది స్పష్టమవుతోంది. సీనియర్ చరణ్ సరసన అంజలి, జూనియర్ చరణ్ జోడిగా కియారా చేసే సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇటు గ్రామీణ నేపథ్యంలోనూ .. అటు సిటీలోను ఈ కథ నడుస్తోంది. బ్రహ్మానందం, సునీల్ , వెన్నెల కిశోర్ పాత్రలను కూడా ట్రైలర్ లో టచ్ చేశారు. ఈ సినిమాలో కామెడీకి కొదవలేదనే హింట్ ఇచ్చేశారు. బుర్రా సాయిమాధవ్ రాసిన పవర్ఫుల్ డైలాగ్స్, యాక్షన్ సీన్స్ ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకుని వెళుతున్నాయి. ప్రధానమైన పాత్రలన్నింటినీ కవర్ చేస్తూ కట్ చేసిన ఈ ట్రైలర్, సినిమాపై అమాంతంగా అంచనాలను పెంచుతోంది. ఇక చరణ్ గళ్ల లుంగీ కట్టుకుని హెలికాప్టర్ లో నుంచి కత్తి పట్టుకుని దూకడం మాస్ ఆడియన్స్ నుంచి మార్కులు కొట్టేసిందనే చెప్పాలి. సంక్రాంతికి 'గేమ్ ఛేంజర్' చేసే హడావిడి ఏ రేంజ్ లో ఉంటుందో చూడాలి మరి.

# 2024లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లు వీళ్లే!

స్పోర్ట్స్ డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత క్రికెట్ జట్టుకు గడిచిన ఏడాది 2024 ఎంతో ప్రత్యేకమైనది. దాదాపు 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐసీసీ టీ20 వరల్డ్ కప్‌ను టీమిండియా ముద్దాడింది. అంతేకాదు కీలకమైన ద్వైపాక్షిక సిరీస్‌లను కూడా గెలుచుకుంది. భారత విజయాలలో కీలక పాత్ర పోషించిన బౌలర్లు పెద్ద సంఖ్యలో వికెట్లను కొల్లగొట్టారు. 2024లో టెస్టులు, వన్డేలు, టీ20లు మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా నంబర్ వన్ స్థానంలో నిలిచాడు. 34 ఇన్నింగ్స్‌ల్లో బుమ్రా ఏకంగా 86 వికెట్లు సాధించాడు. ఎంత మెచ్చుకున్నా తక్కువే అనేలా అతడు అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా తన సత్తా చాటుకున్నాడు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 28 ఇన్నింగ్స్‌లో 49 వికెట్లు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ జట్టులో ఉన్నప్పటికీ చోటు దక్కించుకొని జడేజా ఈ వికెట్లు సాధించడం విశేషం. అయితే, పరిమితి ఓవర్ల క్రికెట్‌లో జడేజా అంతగా ఆకట్టుకోలేకపోయాడు. ఇక ఇటీవలే రిటైర్‌మెంట్ ప్రకటించిన స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ 21 ఇన్నింగ్స్‌ల్లో 47 వికెట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. టెస్టుల్లో మాత్రమే ఆడి ఇన్ని వికెట్లు సాధించడం గమనార్హం.

యువ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 23 ఇన్నింగ్స్‌ల్లో 40 వికెట్లు తీసి 2024లో అత్యధిక వికెట్లు సాధించిన నాలుగవ భారతీయ బౌలర్‌గా నిలిచాడు. టీమిండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ వచ్చిన తర్వాత సుందర్ ప్రదర్శన మెరుగుపడుతోంది. అతడికి అవకాశాలు కూడా దక్కుతున్నాయి. రవిచంద్రన్ అశ్విన్‌కు వారసుడిగా మారేలా ఈ యువ ఆటగాడు కనిపిస్తున్నాడు. ఇక హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ గతేడాది మొత్తం 34 ఇన్నింగ్స్‌ల్లో 40 వికెట్లు తీశాడు. ప్రదర్శన ఎలా ఉన్నా మూడు ఫార్మాట్లలోనూ చోటు దక్కించుకుని టీమిండియాకు కీలక ఆటగాడిగా రాణించాడు.

# సీఎం చంద్రబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ సైనిక జేఏసి



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడుని ఆంధ్రప్రదేశ్ ఎక్ససర్వీస్ మాన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొటూరి శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వై రమేష్‌బాబు, పి.నారాయణ ఆంధ్రప్రదేశ్ మాజీ సైనికుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక కార్యదర్శి కుచ్చులపాటి కుమార్, ఎన్ఈఎక్సెసి సి నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కే.నాగరాజు కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఎంతో కాలంగా పరిష్కారం కానీ మాజీ సైనికుల ఉద్యోగ, గాడ్ సమస్యలు వివరించారు. ముఖ్యమంత్రి కూడా వాటి పరిష్కారం కొరకు హామీ ఇచ్చి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.






Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.